

విశ్వాద నాయకా విహిత వీరా..

లెజెండరీ యాక్టర్ కమల్‌హాసన్, విఖ్యాత దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రానున్న పాన్ ఇండియా గ్యాంగ్‌స్టర్ డ్రామా 'థగ్ లైఫ్'. శింబు, అశోక్ సెల్వన్, త్రిష కృష్ణన్, అభిరామి కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం ఈ నెల 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఏ.ఆర్.రెహమాన్ స్వరకల్పనలో ఇప్పటికే ఈ సినిమా నుంచి మూడు పాటలు విడుదల కాగా, సోమవారం నాలుగో పాటను విడుదల చేశారు. 'విశ్వద నాయకా.. విహిత వీరా.. మనసు నీకై.. రథమై రాదా..' అంటూ సాగే ఈ పాటను అనంత శ్రీరామ్ రాయగా, అలెగ్జాండర్ జాయ్ ఆలపించారు. ప్రశాంత్ వెంకట్ రాసిన ర్యాప్‌ను ఏ.ఆర్ అమీన్ అద్భుతంగా ఆలపించారు. ఈ పాటకు ఈ ర్యాప్ స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచింది. ఇందులోని కమల్‌హాసన్ పాత్రను ప్రజెంట్ చేసేలా ఈ పాట సాగింది. ఈ పాటలో కమల్‌హాసన్ డిఫరెంట్ అవతారాల్లో కనిపిస్తుండటం విశేషం. రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జాయింట్ మూవీస్ నిర్మించిన ఈ చిత్రాన్ని శ్రేష్ట్ మూవీస్ ద్వారా ఎన్.సుధాకర్‌రెడ్డి తెలుగులో విడుదల చేస్తున్న విషయం విదితమే.

కోర్టుకెళ్లిన కమల్.. ఇదిలావుంటే.. 'థగ్‌లైఫ్' సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో కర్ణాటకలో 'థగ్ లైఫ్' సినిమాను ప్రదర్శించుకునేందుకు వీలుగా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ కమల్‌హాసన్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. 'థగ్ లైఫ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో తమిళం నుంచే కన్నడ భాష పుట్టిందని కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలు కర్ణాటకలో తీవ్ర దుమారాన్ని రేకెత్తించాయి. కమల్ క్షమాపణ చెప్పకపోతే 'థగ్ లైఫ్' విడుదలను రాష్ట్రంలో అడ్డుకుంటామని కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ స్పష్టం చేసింది. దీంతో న్యాయపరమైన జోక్యాన్ని కోరుతూ కమల్ కోర్ట్‌ను ఆశ్రయించారు. .

'కుబేర'తో జీవిత సత్యాల్ని తెలుసుకున్నా!



'ఈ సినిమా కోసం తిరుపతి ఎండల్లో చెప్పులు లేకుండా, చిరిగిన బట్టలు ధరించి, బిచ్చగాడి పాత్రలో కనిపించడం మరచిపోలేని అనుభవం. అది నాకు ఎన్నో జీవిత సత్యాలను నేర్పించింది' అన్నారు అగ్ర హీరో ధనుష్. ఆయన నాగార్జునతో కలిసి నటించిన మల్టీస్టారర్ చిత్రం 'కుబేర' ఆడియో లాంచ్ ఈవెంట్ ఆదివారం చెన్నైలో జరిగింది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కిన ఈ చిత్రంలో రష్మిక మందన్న కథానాయికగా నటించింది. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మాతలు. ఈ నెల 20న విడుదల కానుంది.

ఈ సందర్భంగా ధనుష్ మాట్లాడుతూ.. 'రాంజనా' షూటింగ్ సమయంలో కాశీలో చితుల మధ్య గడిపిన సమయంలో డబ్బు, విలాసాలు, ప్రాపంచిక సుఖాలు ఏవీ శాశ్వతం కాదని అర్థమైందని, స్వచ్ఛమైన మనసు ముఖ్యమనే అంశాన్ని 'కుబేర'లో చర్చించామని, శేఖర్ కమ్ముల వంటి సహృదయత కలిగిన వ్యక్తితో పనిచేయడం గొప్ప అనుభూతినిచ్చిందన్నారు. 'నేను ఆడయార్‌లో పుట్టి..ఇక్కడి కాలేజీలోనే ఇంజనీరింగ్ చదువుకున్నా. ఇక్కడే కెరీర్‌ను ఆరంభించాను. కొన్ని దశాబ్దాలుగా తమిళ ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమకు కృతజ్ఞతలు' అని నాగార్జున పేర్కొన్నారు. ఈ సినిమాలో ధనుష్, నాగార్జున ఇద్దరూ మెస్మరైజింగ్‌గా పర్‌ఫార్మ్ చేశారని, చక్కటి సోషల్ డ్రామాగా ఆకట్టుకుంటుందని దర్శకుడు శేఖర్ కమ్ముల తెలిపారు. భారీ స్థాయిలో సినిమాను రిలీజ్ చేయబోతున్నామని నిర్మాతలు సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు చెప్పారు. తన కెరీర్‌లో 'కుబేర' ప్రత్యేకమైన చిత్రమని కథానాయిక రష్మిక మందన్న పేర్కొంది.

కోహినూర్ కహానీ?



పవన్‌కల్యాణ్ 'హరిహర వీరమల్లు – పార్ట్ 1' సినిమా ఈ నెల 12 నుంచి థియేటర్లలో సందడి చేయనున్న విషయం తెలిసిందే. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో కొంత భాగం పూర్తయిన ఈ సినిమాను, జ్యోతికృష్ణ పూర్తి చేశారు. ఇదిలావుంటే.. ఇదే వీరమల్లు కథ అంటూ సోషల్ మీడియాలో ఓ లైన్ హల్‌చల్ చేస్తున్నది. ఇందులో హరిహర వీరమల్లు అనే దొంగగా పవన్‌కల్యాణ్ కనిపిస్తారట. ఉన్నోడ్డి కొట్టి లేనోడికి పెట్టే రాబిన్ హుడ్ తరహా పాత్ర అన్న మాట. 17వ శతాబ్దం నాటి మొఘల్ సామ్రాజ్య కాలంలో ఈ కథ నడుస్తుందట. గోల్కొండ తానీషా నుంచి మొదలైన కథ, మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు దగ్గర ముగుస్తుందట. కోహినూర్ వజ్రం ఈ కథకు కీలకమని సమాచారం. మొఘల్ రాజు ఆస్థానంలో ఉన్న ఆ వజ్రాన్ని దొంగిలించేందుకు హీరో చేసే ప్రయత్నమే ఈ సినిమా కథ అట. పవన్‌కల్యాణ్ నటిస్తున్న ఈ తొలి జానపద చిత్రంలో పంచమి అనే పాత్రలో నిధి అగర్వాల్ నటిస్తుండగా, ఔరంగజేబుగా బాబీడియోల్ కనిపిస్తారట. ఇక ఏయే పాత్రలు ఎవరు పోషిస్తారనేది తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

గద్దర్ అవార్డ్స్‌లో తెలంగాణ వారికి అన్యాయం

తెలుగు సినీరంగంలో ఇటీవల తలెత్తిన థియేటర్ల సమస్యకు ఇండస్ట్రీలోని ఆ నలుగురే కారణమని అన్నారు టీఎఫ్‌సీసీ ఛైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్. వాళ్లు థియేటర్లు, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థను నాశనం చేస్తున్నారని, ఎఫ్‌డీసీ అధికారాలను దిల్ రాజు దుర్వినియోగం చేశారని, గద్దర్ అవార్డ్స్‌లో తెలంగాణ కళాకారులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఇండస్ట్రీ సమస్యలపై మాట్లాడారు. 2002 వరకు థియేటర్స్‌లో పర్సంటేజీ వ్యవస్థ ఉండేదని, ఆ తర్వాత సురేష్ బాబు, అల్లు అరవింద్, దిల్‌రాజు, ఏషియన్ సునీల్‌లాంటి వారు థియేటర్స్‌ను తమ కబంధ హస్తాల్లో పెట్టుకున్నారని ఆర్.కె.గౌడ్ అన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ 'తెలుగు రాష్ట్రాల్లో 1500 థియేటర్లలో 300 థియేటర్లను మాత్రమే ఓనర్స్ నడుపుతున్నారు. మిగతావన్నీ లీజ్ పద్ధతిలో రెంట్ మీద నడుస్తున్నాయి. పర్సంటేజీ సిస్టమ్ కోసం గతంలో మేము నిరాహారదీక్ష చేశాం. ఏపీలో థియేటర్ల వ్యవస్థ ప్రక్షాళనకు పవన్‌కల్యాణ్ తీసుకుంటున్న చర్యలను అభినందిస్తున్నాం. తెలంగాణలో కూడా సినిమాటోగ్రఫీ మంత్రి ఆధ్వర్యంలో చర్యలు చేపట్టాలి' అన్నారు. గద్దర్ అవార్డ్స్ గురించి మాట్లాడుతూ 'తెలంగాణ అవార్డ్స్ జ్యూరీకి మురళీమోహన్, జయసుధను ఛైర్మన్‌గా పెట్టడం ఏమిటో అర్థం కాలేదు. తెలంగాణ అవార్డ్స్‌లో తెలంగాణ వారికి ప్రాతినిధ్యం లేకుండా పోయింది. దిల్‌రాజు తనవాళ్లకే అవార్డులను ఇచ్చుకున్నారు. థియేటర్ల బంద్ ఇష్యూలో కూడా ఆయన ప్రమేయం ఉంది' అని ఆర్.కె.గౌడ్ అన్నారు. ఇందులో టీఎఫ్‌సీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్, తెలంగాణ దర్శకుల సంఘం అధ్యక్షుడు రమేష్ నాయుడు, రైటర్స్ యూనియన్ అధ్యక్షుడు అమృత్ గౌడ్ పాల్గొన్నారు.

తుదిశ్వాస వరకూ నటిస్తూనే ఉంటా

' 'షష్టిపూర్తి' అనేది కల్ట్ బ్లాక్ బస్టర్. 'పెళ్లి పుస్తకం' నుంచి 'షష్టిపూర్తి' వరకూ ఏ నటుడికీ దక్కని సినీ ప్రయాణం నాకు దక్కింది. కొడుకు కథ చెబుతూనే తల్లిదండ్రుల గురించి అద్భుతంగా చూపించారు దర్శకుడు పవన్ ప్రభ. ఇలాంటి సినిమాలు మరిన్ని రావాలి. నిర్మాతగా రూపేష్ గొప్ప స్థాయికి వెళ్తాడు. ఇలాంటి అద్భుతమైన పాత్రలు నా తుది శ్వాస వరకు చేయాలని కోరుకంటున్నా.' అని డా. రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆయన, అర్చన జంటగా.. రూపేష్, ఆకాంక్షసింగ్ మరో జంటగా రూపొందిన కుటుంబకథాచిత్రం షష్టిపూర్తి. పవన్ ప్రభ దర్శకత్వంలో రూపేష్ నిర్మించిన ఈ చిత్రం మే 30న విడుదలైంది. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా సక్సెస్ మీట్‌లో రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. ఇళయరాజా, తోట తరణి, రాజేంద్రప్రసాద్, అర్చన వంటి దిగ్గజాలు పనిచేసిన సినిమా ఇదని, రాజేంద్రప్రసాద్ లేకుండా ఈ సినిమా లేదని హీరో, నిర్మాత రూపేష్ చెప్పారు. ప్రేమని, కుటుంబ విలువల్ని నమ్ముకొని ఈ సినిమా చేశామని, సినిమాకు వస్తున్న స్పందన చూస్తుంటే చాలా సంతృప్తిగా ఉందని దర్శకుడు పవన్‌ప్రభ తెలిపారు. ఇంకా గీత రచయిత చైతన్య ప్రసాద్, డీవోపీ రామ్ కూడా మాట్లాడారు.

ఘాటి ఆగమనం

అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో రూపొందుతున్న మోస్ట్ అవైటెడ్ థ్రిల్లర్ అడ్వెంచర్ 'ఘాటి'. తమిళ స్టార్ విక్రమ్ ప్రభు ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మాతలు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. జూలై 11న 'ఘాటి' విడుదలకాబోతున్నదని తెలియజేస్తూ సోమవారం మేకర్స్ రిలీజ్ డేట్ పోస్టర్‌ని విడుదల చేశారు. అనుష్క, విక్రమ్ ప్రభు కలిసి ఓ నదిలో నుంచి సంచులు మోసుకుంటూ వెళ్తున్న విజువల్స్, వారి ఇంటెన్స్ జర్నీని ఈ పోస్టర్ సూచిస్తున్నది. ఈ చిత్రానికి మాటలు: సాయిమాధవ్ బుర్రా, కెమెరా: మనోజ్‌రెడ్డి కాటసాని, సంగీత: నాగవెల్లి విద్యాసాగర్, నిర్మాణం: ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్.

అది నా వ్యక్తిగత విషయం

సినిమా ప్రమోషన్స్‌లో నయనతార పాల్గొనడం లేదు. ఈ విషయంపై ఆమె పలు విమర్శలను కూడా ఎదుర్కొన్నారు.. ఎదుర్కొంటున్నారు కూడా. అయితే.. రీసెంట్‌గా చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న 'మెగా 157'(వర్కింగ్ టైటిల్) మూవీకి మాత్రం తాను నటిస్తున్నట్టు చెప్పే క్రమంలో.. తెగ ప్రమోట్ చేశారు నయన్. అనిల్ రావిపూడి మార్క్ జోష్‌తో వీడియోల్లో చెలరేగిపోయారు. వీటిపై కోలీవుడ్‌లో విమర్శలు వచ్చాయట. టాలీవుడ్ సినిమాపై అంత మమకారం ఉంటే అక్కడే సినిమాలు చేయొచ్చుగా? అంటూ కొందరు నెటిజన్లు కామెంట్లు చేశారు. దీనిపై నయన్ ఇటీవలే స్పందించారు. 'సమయాన్ని వృథా చేసుకోవడం నాకిష్టం ఉండదు. వీలును బట్టి నా నిర్మాతలకు సహకరిస్తూనే ఉన్నా. ఈ విషయంపై ఒకరికి సమాధానం చెప్పుకోవాల్సిన అవసరం నాకు లేదు. అది నా వ్యక్తిగతమైన ఛాయిస్' అంటూ నిర్మొహమాటంగా సమాధానమిచ్చింది. ప్రస్తుతం నయనతార చేతిలో తెలుగు, తమిళ, కన్నడ ,మలయాళ భాషల్లో కలిపి ఓ అరడజనుకు పైగా సినిమాలున్నాయి.

తొలిప్రేమ తోపుకాదు..

గత ఏడాది 'క' చిత్రంతో మంచి విజయాన్ని దక్కించుకున్నారు హీరో కిరణ్ అబ్బవరం. ఆయన నటిస్తున్న తాజా చిత్రానికి 'చెన్నై లవ్‌స్టోరీ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. శ్రీగౌరీ ప్రియ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకుడు. సాయిరాజేష్ కథనందించడంతో పాటు ఎస్‌కేఎన్‌తో కలిసి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సోమవారం టైటిల్‌తో పాటు గ్లింప్స్‌ను విడుదల చేశారు. 'తొలి ప్రేమేం తోపు కాదు.. ఫస్ట్‌లవ్ ఫెయిలయితేనే బెస్ట్ లవ్ ఎక్కడో మొదలవుతుంది..' అనే హీరో సంభాషణతో మొదలైన గ్లింప్స్ ఆసక్తికరంగా ఉంది. నాయకానాయికలు సముద్రపు ఒడ్డున కూర్చుని తొలి ప్రేమ గురించి మాట్లాడుకునే డైలాగ్స్ ఇంట్రెస్టింగ్‌గా అనిపించాయి. ఈ సుదీర్ఘ జీవిత పయనంలో తొలిప్రేమ ఒక మజిలీ మాత్రమేనని, అదే చివరిది కాదనే కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించారని గ్లింప్స్‌ను చూస్తే అర్థమవుతున్నది. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, కథ: సాయిరాజేష్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: రవి నంబూరి.

ఆ తర్వాత నటుడిగా చేయడానికేం ఉండదు

ప్రస్తుతం అమీర్‌ఖాన్ తన తాజా ప్రాజెక్ట్ 'సితారే జమీన్ పర్' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అమీర్.. తన కెరీర్ గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. 'ప్రస్తుతం నా ఫోకస్ అంతా 'సితారే జమీన్ పర్'పైనే. ఈ సినిమా విడుదలయ్యాక నా కలల ప్రాజెక్ట్ 'మహాభారతం'పై దృష్టి సారిస్తా. అత్యంత భారీగా ఈ చిత్రాన్ని నిర్మించాలనేది నా కోరిక. ఎన్నో ఏళ్ల నుంచి ఈ కథతో ప్రయాణిస్తున్నా. వెండితెర వేదికపై అద్భుతంగా దీన్ని ప్రేక్షకులకు చూపించాలని కలలు కంటున్నా. ప్రపంచంలో మనం చూసే ప్రతి విషయంలో మహాభారతం ఉంటుంది. ఎన్నో కోణాల, భావోద్వేగాల సమ్మేళనం మహాభారతం. నేటితరానికి, భావి తరాలకు దీని గురించి తెలియజేయాల్సిన బాధ్యత మనందరిలో ఉంది. అయితే.. ఈ సినిమా తర్వాత ఇండస్ట్రీలో నేను నటుడిగా చేయడానికి ఏమీ ఉండదన్నది నా భావన. కానీ నాకైతే నటుడిగానే చనిపోవాలనుంది' అంటూ చెప్పుకొచ్చారు అమీర్‌ఖాన్.

అడవిలో ఏం జరిగింది?

కన్నడంలో విజయం సాధించిన 'అపాయవీడి హెచ్చరిక' చిత్రం తెలుగులో 'డేంజర్ బాయ్స్'గా రాబోతున్నది. శ్రీరంగం సతీష్‌కుమార్ తెలుగు అనువాద వెర్షన్‌ను అందిస్తున్నారు. వికాస్ ఉత్తయ్య, రాధా భగవతి, అశ్విన్ హసన్, రాఘవ్ కొడబాద్రి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి అభిజిత్ తీర్థహల్లి దర్శకత్వం వహించారు. హారర్ సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశమిదని, గంధపు చెక్కల వేటలో ముగ్గురు స్నేహితులకు అడవిలో ఎదురైన అనుభవాలు థ్రిల్‌ను పంచుతాయని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ, సంగీతం: సునాద్ గౌతమ్.

తండ్రి ప్రేమను చాటే 'చౌకీదార్'

సాయికుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'చౌకీదార్'. పృథ్వీ అంబర్, ధన్య రమ్యకుమార్ జంటగా నటిస్తున్నారు. తెలుగు, కన్నడ భాషల్లో చంద్రశేఖర్ బండియప్ప రూపొందిస్తున్నారు. కల్లహల్లి చంద్రశేఖర్ నిర్మాత. సోమవారం ఈ సినిమాలోని ఓ ఎమోషనల్ సాంగ్‌ను విడుదల చేశారు. నాన్న గొప్పదనాన్ని తెలియజెపుతూ హృద్యంగా సాగిందీ గీతం. సచిన్ బస్రూర్ స్వరపరచిన ఈ పాటను విజయ్‌ప్రకాష్ ఆలపించారు. సాయికుమార్ తండ్రి పాత్రలో ఆకట్టుకున్నారు. పృథ్వీఅంబర్, సాయికుమార్ మధ్య వచ్చే సన్నివేశాలు హృదయాన్ని కదిలించేలా ఉన్నాయి. ఈ సినిమా విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.